# భారతదేశంలోని రైతుల ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం

**మైలారిశెట్టి చైతన్య, రీసెర్చ్ స్కాలర్,**
**తెలుగువిశ్వవిద్యాలయం.**

అధికరైతాంగమే తిరోగమన సంకేతం సేద్యంలోనే స్వేదం చిందిస్తున్న 70 కోట్ల మంది కలిగిన రైతురాజ్య భారతావని. 40 కోట్ల ఎకరాల సువిశాల సాగుక్షేత్రం. ప్రతీ ఏటా 28.5 కోట్ల టన్నుల వ్యవసాయం ఉత్పత్తులు సాధిస్తున్న సుఫల ధరిత్రి జిడిపిలో 16.5 శాతం వాటా కలిగిన వ్యవసాయ ప్రభావ ఆర్థిక వ్యవస్థ. ఈ గణాంకాలు చూస్తే వ్యవసాయ రంగంలో భారతదేశం అద్భుతం చేస్తున్నట్లే అనిస్తుంది. కానీ ఈ లెక్కలు మన గొప్పతనానికి ఏ మాత్రం గీటురాళ్లు కావు. ఇవి వెనుకబాటుకు వెక్కిరింతలు ఎక్కువ మంది రైతులు, ఎక్కువ సాగు భూమి, జిడిపిలో ఎక్కువ శాతం వ్యవసాయం వాటా మొదలైన ఈ లెక్కలన్నీ వాస్తవానికి తిరోగమన సంకేతాలు. వ్యవసాయంలోనే కాదు, అసలు ఈ దేశం నడవాల్సిన తీరులో నడవలేకపోతున్నదని, దారి తప్పిందని స్పష్టమవడానికి ఆధారాలు. దేశం తీరు మారి తీరాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఇతర జంతువుల మాదిరిగానే ఒకప్పుడు మానవులకు కూడా ఆహార అన్వేషణలోనే కాల మంతా గడిచేది. ఆ వెతుకులాట నుంచి పుట్టిన విప్లవమే వ్యవసాయం. నాగరికత తొలి అడుగు వ్యవసాయంతో మొదలయింది కానీ మానవ జీవితం అక్కడే ఆగికుండా అనేక దశలు దాటుకు ంటూ వెళ్లిపోతున్నది. ఆదిమ కాలం మాదిరిగానే ఆహారం సంపాదించడానికే మొత్తం కాలం, శ్రమ ఖర్చు చేయడం లేదు. చాలా దేశాలు తమకు కావాల్సిన తిండిని ఉత్పత్తి చేసుకుంటూ జేబులు నింపే మరో పనిచేసుకుంటున్నాయి. తిండి గింజలు పొట్టనిండడానికి ఉపయోగపడ తాయి కానీ, జేబు నిండడానికి ఉపయోగపడవని గ్రహించాయి. కానీ కొన్ని సమాజాలు మాత్రం ఆరంభ దశలోనే ఆగిపోయాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితా నుంచి ఆ దేశాలు దారి ద్రరేఖను దాటి ఆ దేశాల ప్రజలు బయటపడడం లేదు. అలాంటి కొన్ని దేశాల జాబితాలో

భారతదేశంలోని భారత ప్రజలు ఉండడం ఏడు దశాబ్దాల స్వతంత్ర్య భారతం సాధించిన వైఫల్యం.

సగం జనాభాకు పైగా వ్యవసాయం మీద ఆధారపడి బతకాల్సి రావడమే వెనుకబాటుకు కారణం. 1950 దశకంలో నోబుల్ బహుమతి గ్రహీత ఆర్థర్ లూయిస్ ప్రతిపాదించిన నిర్మాణాత్మక పరివర్తన ఆర్థిక సిద్ధాంతం (స్ట్రక్చరల్ ట్రాన్స్ ఫామింగ్ థియరీ)' ప్రపంచ దేశాలకు దిశానిర్దేశం చేసింది. ప్రాథమిక రంగమైన వ్యవసాయం, దాని అనుబంధ వృత్తుల నుంచి ద్వితీయ, తృతీయ రంగాలుగా పేర్కొన్న పారిశ్రామిక, సేవారంగాలకు ఎంత ఎక్కువ మంది బదిలీ కాగలిగితే ఆ దేశాలు అంత తక్కువ సమయంలో వృద్ధి చెందుతాయని ఆ సిద్ధాంతం తేల్చి చెప్పింది. సంపన్న దేశాలుగా అవతరించిన అమెరికా, చైనా, జపాన్, జర్మనీ, ఇంగ్లండ్ లాంటి దేశాలు ఇలా పరివర్తన చెందినవే. ఫోర్ ఏసియన్ టైగర్స్‌గా పేరొందిన హాంగ్‌కాంగ్, సింగపూర్ , సౌత్‌కొరియా, తైవాన్ ఈ థియరీని అనుసరించి, కేవలం 30 ఏళ్లలో (1960-90) తమ స్థితిని అమాంతం మార్చుకున్నాయి. భారతదేశంలో సగానికిపైగా వ్యవసాయ రంగం మీద ఆధారపడి బతుకుతుంటే, అమెరికాలో కేవలం 0.7, జపాన్‌లో 3.9, జర్మనీల 2.4, ఇంగ్లండులో 1.4, రష్యాలో 5.9 శాతం మంది మాత్రమే వ్యవసాయంలో ఉన్నారు. మన లాంటి దేశమే ఆయిన చైనాలో 26 శాతం వ్యవసాయంలో అద్భుతాలు సృష్టిస్తున్న ఇజ్రాయిల్‌లో 2 శాతం మంది వ్యవసాయ రంగంలో ఉన్నారు. ఆయా దేశాల్లో ఒకప్పుడు వ్యవసాయం మీదనే ఆధారపడిన మిగతా జనమంతా పారిశ్రామిక రంగాలకు బదిలీ చేయబడినారు. ఫలితంగా వ్యక్తిగతంగా బాగుపడటమే కాకుండా దేశాలు బాగుపడినాయి.

ఆయా దేశాల స్థూల దేశీయోత్పత్తి(జిడిపి)లో వ్యవసాయరంగం వాటా ఎంత తక్కువవుంటే ఆ దేశం అంత స్థిరమైన ఆర్థిక ప్రగతి సాధిస్తున్నట్లు లెక్క ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం భారతదేశ జిడిపిలో వ్యవసాయరంగం వాటా 16.5 శాతమైతే, అమెరికాలో అది 0.9, చైనాలో 7.9, జపాన్‌లో 1.1, జర్మనీలో 0.7, ఇంగ్లండులో 0.7, రష్యాలో 3.55, ఇజ్రాయిల్లో 2.4 శాతం వ్యవసాయ రంగం వాటా ఉంది. ప్రాథమిక రంగంలో తక్కువ మంది ఉండి, జిడిపిలో వ్యవసాయ రంగం వాటా తక్కువ ఉన్నప్పటికీ పైన పేర్కొన్న దేశాలన్నీ తమకు కావల్సిన ఆహార ఉత్పత్తుల్లో స్వయం సమృద్ధి కలిగిన దేశాలు. అంటే ఆయా దేశాలు వ్యవసాయాన్ని తమకు తిండి పెట్టే రంగంగా, మిగతా రంగాలను ఆర్థికంగా శక్తినిచ్చే రంగాలుగా చూస్తున్నాయి. కానీ

భారతదేశంలో రెండింటికీ వ్యవసాయమే దిక్కయింది. తక్కువ సమయంలోనే పెద్ద ఎత్తున వ్యవసాయ రంగం నుంచి పారిశ్రామీకరణకు తరలించడం సాధ్యమయ్యే పనికాకపోవచ్చు. అందుకే వ్యవసాయాధారిత పరిశ్రమలను పెంచే పని వేగం అందుకోవాలి. వీలైనన్ని ఎక్కువ ఫుడ్ ప్రాసెసింగ్ సెజ్‌లు స్థాపించాలనే తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ఆలోచన అందులో భాగంగానే కనిపిస్తున్నది. ఇలాంటి ప్రయత్నాలు దేశ వ్యాప్తంగా స్ఫూర్తివంతంగా ఉండాలని ఆలోచన.

నిర్మాణాత్మక పరివర్తన ఆర్థిక సిద్ధాంతం అమలు చేసే తీరాలని భారతదేశంలో కూడా ప్రయత్నాలు జరిగాయి. నెహ్రూ నాయకత్వంలో రెండవ పంచవర్ష ప్రణాళిక ప్రధాన లక్ష్యం కూడా వేగవంతమైన పారిశ్రామికీకరణే (రాపిడ్ ఇండస్ట్రీయలైజేషన్), కానీ తర్వాత వేర్వేరు కారణాల వల్ల ఆ స్ఫూర్తి కొనసాగలేదు. దేశంలో ఆహార కొరత ఏర్పడి, హరితవిప్లవం అత్యవసరం అయిపోయి, పారిశ్రామికీకరణ ఆశించిన వేగం అందుకోలేదు. ఫలితంగా వ్యవసాయమే దిక్కయింది. అప్పుడు ఈ రంగాన్నయినా ఉన్నతంగా తీర్చిదిద్ది ఉండాల్సింది. అక్కడా లోపమే జరిగింది.హరిత విప్లవం కారణంగా దేశంలో ఉత్పత్తిపెరిగింది కానీ ఉత్పాదకత పెరగలేదు. పారిశ్రామిక, సేవా రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించిన దేశాలే వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను కూడా బాగా పెంచుకోవడం గమనించదగ్గ విషయం.

ఐక్యరాజ్యసమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ వెల్లడించిన వివరాలు భారతదేశంలో వ్యవసాయ ఉత్పాదకత డొల్లతనాన్ని బయటపెడుతున్నవి. సాధించగలుతున్నారు. కానీ మనలాంటి వాతావరణ పరిస్థితులే కలిగిన చైనాలో కేవలం 38కోట్ల మంది రైతులు 34 కోట్ల ఎకరాల వ్యవసాయ భూమిలో ఏటా 571 మిలియన్ టన్నుల పంట పండిస్తున్నారు. భారతదేశంలో ఎకరానికి ఏడాదికి సగటున 17.8 క్వింటాళ్ల వరిధాన్యం పండిస్తే, చైనాలో 28.4 క్వింటాళ్లు పండిస్తున్నారు. అమెరికాలో 34.8, జపాన్‌లో 26.7, రష్యాలో 20 క్వింటాళ్ల ధాన్యం పండిస్తున్నారు. (దేశ సగటుతో పోలిస్తే తెలంగాణ రాష్ట్రం 24 క్వింటాళ్ల సగటు ఉత్పాదకతతో మెరుగ్గా ఉంది) దేశంలో ఇతర పంటల విషయంలో కూడా పరిస్థితి ఇలాగే ఉంది. వరి, గోధుమల లాంటి తిండి గింజలు, పప్పుల ఉత్పత్తిలో చైనా తర్వాత భారతదేశం రెండో స్థానంలో ఉంటే, ఉత్పాదకతలో మాత్రం 38వ స్థానంలో ఉన్నది. పప్పులను భారతదేశం దిగుమతి చేసుకుంటున్నది.

మనుషులు ఎవరైనా సరే తమ అభిరుచికి, నైపుణ్యానికి తగిన వృత్తి ఎంచుకుంటారు. ఒక్కరైతు మాత్రమే వ్యవసాయాన్ని విధిరాత అనుకుంటూ నెట్టుకొస్తున్నాడు. సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ డెవలప్మెంట్ సొసైటీస్ అనే సంస్థ దేశవ్యాప్తంగా జరిగిన సర్వేలో తాము విధిలేక వ్యవసాయంచేస్తున్నామని 65 శాతం మంది రైతులు చెప్పారు. అవకాశం వస్తే మరో రంగంలోకి పోతామని 62 శాతం మంది రైతులు చెప్పుకున్నారు. గ్రామాల్లో వ్యవసాయం చేయడం కన్నా పట్టణాలకు పోయి కూలీ పని చేసుకోవడమే ఉత్తమమనే అభిప్రాయాన్ని 69శాతం మంది రైతులు వెలిబుచ్చారు. మరో అవకాశం వస్తే వెళ్లిపోతామని రైతులు అంటున్నారు. ఇది దేశానికీ అవసరం కాబట్టి భారతదేశంలో కొత్త వృత్తుల సృష్టి జరిగి తీరాలి. అందరూ ఒకే పంట వేయడం ఎట్లా లాభదాయకం కాదో, అందరూ ఒకే పనిలో ఉండడం కూడా ప్రయోజనకరం కాదు. చైనాలో కేవలం పదేళ్లకాలంలోనే వ్యవసాయం మీద ఆధారపడే వారి సంఖ్యను 70 శాతం నుంచి 23 శాతానికి తగ్గించారు. ఉత్పత్తిని 250 మిలియన్ టన్నుల నుంచి 571 మిలియన్ టన్నులకు తీసుకుపోయారు. భారత్‌లో కూడా తక్కువ మందితో ఎక్కువ పంట పండించాలి. ప్రతి ఏటా ప్రభుత్వం నిర్దేశించుకునే లక్ష్యాల్లో వ్యవసాయ రంగం నుంచి ఈ సారి ఇంత మందిని ఇతర రంగాలకు తరలించాలనే లక్ష్యం కూడా ఉండి తీరాలి. పారిశ్రామిక, సేవా రంగాల్లో వచ్చే గణనీయ ఆదాయంలో కొంత భాగాన్ని (క్రాస్ సబ్సిడీగా) వ్యవసాయ రంగాభివృద్ధికి ఉపయోగించడం ఉత్తమ ఆర్థిక విధానం అవుతుంది. దేశ రక్షణ బాధ్యతల్లో ఉండే సైనికుల సంక్షేమం మాదిరిగానే, ప్రజల ఆహార భద్రత బాధ్యత నిర్వహిస్తున్న రైతు సంక్షేమం అమలు కావాలంటే కూడా ఇతర రంగాల పురోగతి తప్పనిసరి.